క్లుప్తంగా

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి



ఆర్డీఓ మాధవికి ముంపు సమస్య వివరిస్తున్న ముంపు గ్రామాల రైతులు

మామిడికుదురు: వాడబోది మీడియం డ్రైన్ ద్వారా వస్తున్న ఉప్పునీటితో కొబ్బరి చెట్లు తలలు వాల్చేస్తున్నాయని, వరి చేలు ఉప్పునీటి మయంగా మారి పంటలు పండడం లేదని పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సోమవారం అమలాపురంలో ఆర్డీఓ కె.మాధవికి మొరపెట్టుకున్నారు. ఓఎన్జీసీ నిర్మించిన రోడ్ల వల్ల ఈ సమస్య జటిలంగా మారిందన్నారు. ఏటా తమకు నష్ట పరిహారం ఇచ్చి ఓఎన్జీసీ అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారని వాపోయారు. దీనిపై స్పందించి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వాడబోది మీడియం డ్రైన్ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మాధవి తెలిపారన్నారు. ఆర్డీఓను కలసిన వారిలో కోలా సత్యనారాయణ, వేగి లక్ష్మీనారాయణ, రాయపురెడ్డి శ్రీను, గంధం స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డిని కలసిన నాయకులు

కొత్తపేట: జిల్లా పార్టీ కమిటీలో నూతనంగా నియమితులైన పలువురు నాయకులు రావులపాలెం మండలంలో గోపాలపురంలో జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం యువజన విభాగం నాయకుడు సలాది సతీష్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని జగ్గిరెడ్డికి అందజేశారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి గొలకోటి సూర్యప్రకాష్, గుమ్మళ్ల సురేష్ ఉన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ల తనిఖీ



జొన్నాడలో ఇసుక నిల్వలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలను సోమవారం అధికారుల బృందం తనిఖీ చేసింది. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ నేతృత్వంలో మండపేట ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీఓ రాజు నేతృత్వంలో సిబ్బంది నిల్వలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఇసుకను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇసుక నిల్వల వద్ద ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఎం.మెహెర్ ప్రకాష్, గ్రామ కార్యదర్శి సుభాష్, వీఆర్‌ఓ సీహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు ఎస్సైగా నరేష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై నరేష్

ఆలమూరు: ఆలమూరు సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై)గా జి.నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం క్రైమ్ డిపార్ట్‌మెంట్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నరేష్ 2019–2024 మధ్యకాలంలో రాయవరం, ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.

వినియోగదారుల సమస్యలపై స్పందించాలి



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న స్టాలిన్‌బాబు

అంబాజీపేట: కోనసీమ ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కమిటీ మాజీ సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు అన్నారు. ఇటీవల పదోన్నతిపై ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం ఫైనాన్స్)గా నియమితులైన కోనసీమ జిల్లాకు చెందిన పెట్టా వెంకటేశ్వరరావును విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో స్టాలిన్‌బాబు సోమవారం కలసి ఆయనను అభినందించారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు మరియు ఆక్వా రైతులు విద్యుత్ బిల్లుల పరంగా ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావుకు వివరించారు. నిరుపేద దళితులకు ఉచిత విద్యుత్‌ను, దళిత కాలనీలకు ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ ద్వారా విద్యుత్తును అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కోనసీమ ప్రాంతం నుంచి ఈ ఉన్నత ఉద్యోగ స్థానంలో ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని దుశ్శాలువాతో సత్కరించారు.

జగన్ మళ్లీ సీఎం అయ్యేందుకు పాటుపడాలి

- కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి పిలుపు
- ఉయ్యూరివారి మెరకలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'
- హామీలను గాలికొదిలేశారని విమర్శలు



ఉయ్యూరివారిమెరకలో రాజశేఖరరెడ్డి, అంబేద్కర్ చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు



ఉయ్యూరువారి మెరకలో నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేసేందుకు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యేలా ప్రతి కార్యకర్తా పాటు పడాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఉయ్యూరువారి మెరకలో సోమవారం రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిన సంక్షేమ ప్రభుత్వం తిరిగి తెచ్చుకోవడానికి సీఎంగా జగన్ చేసుకోవాలని, పేద, ధనిక అనే తేడా లేకుండా ఉండేందుకు, రైతులకు గిట్టుబాటు ధరలు రావాలన్నా, పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో కోతలు కూసిందన్నారు. తల్లికి వందనంలో అర్హులకు సైతం కోతలు పెట్టారన్నారు. పథకానికి అర్హులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు ఈ పథకం లబ్ధి అందకుండా చేసి కూటమి ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టిందన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్నారు. అయితే ఒక్క రైతుకూ మూడు పంటలు వెళ్లినా ఈ సాయం అందలేదు. మూడు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారు. ఫ్రీ బస్సు ప్రయాణం తుస్సుమందని విమర్శలు గుప్పించారు. మరో అతిథి అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో సంక్షేమ ప్రభుత్వం సాగింది. జగన్ పేరు చెబితేనే కూటమి నాయకులకు సింహస్వప్నమన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలంటే లెక్కలేదు. మేనిఫెస్టోను తుంగలో తొక్కారు. మరో నాయకుడు ధర్మ పరిరక్షణ అంటాడు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూడడమా. ఏ ఒక్క సామాజికవర్గం కూటమి ప్రభుత్వంలో సంతోషంగా లేదు. ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన ఏ కోశానా లేదన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మా సంక్షేమం ఇది, అభివృద్ధి ఇది అని ప్రజలకు చెప్పగలిగే నాయకత్వం మాకుంది. కరెంటు బిల్లులు చూస్తున్నా, మద్యం చూస్తున్నా ప్రజలు ఛీకొడుతున్నారు.

ఎన్టీఆర్ పార్టీ పెడితే వైస్రాయ్ హోటల్ సాక్షిగా వెన్నుపోటు పొడిచిన వ్యక్తి చంద్రబాబు. రాజోలు నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా మేము కొండంత అండగా ఉన్నాం. జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి సారథ్యంలో జిల్లాలో పార్టీని ప్రగతి పథంలో నడిపించడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వం నేలకూలే వరకూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ పోరాడదాం. కూటమి ప్రభుత్వంలోని ఇసుక పర్వతాలే ఎవరెస్ట్ శిఖరాలు కన్నా ఎత్తైనవన్నారు. రాజోలు నియోజకవర్గ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తలు ఏ నియోజకవర్గంలో లేని విధంగా రాజోలులో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో నా సోదరులు అందరూ కష్టపడి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. రాజకీయంగా కష్టపడే వారికి అధిష్టానం ఎప్పుడూ న్యాయం చేస్తుందన్నారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, సూర్యారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు ఓగూరి రత్నకుమారి, పీఏల్పీ మంగతాయారుతో కలసి వారు జ్యోతిప్రజ్వలన చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీరబ్రహ్మాజీ, గ్రామశాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కరరావు, కట్టా శ్రీనివాస్, బొలిశెట్టి భగవాన్, నాయకులు జంపన బుజ్జిరాజు, సూరిశెట్టి బాబీ, కె.రాంబాబు, ఈద రవిరెడ్డి, తెన్నేటి కిషోర్, పాటి శివకుమార్, కె.ఆదిత్యకుమార్, మంగెన సింహాద్రి, దొంగ ఏసు, నేతల నాని, గుర్రం జాషువా, బి.అజయ్, తులా సత్యనారాయణ, జెడ్పీటీసీలు మట్టా శైలజ, బళ్ల ప్రసన్నకుమారి మాట్లాడారు. చివరగా సూపర్‌సిక్స్ హామీలు తెలిపే క్యూ ఆర్ కోడ్‌ను జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, సూర్యారావు ఆవిష్కరించారు. అలాగే పార్టీ కార్యక్రమాలకు సంబంధించి మరో క్యూఆర్ కోడ్‌ను వారు ఆవిష్కరించారు. జగ్గిరెడ్డి, విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

అంబాజీపేట: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ కోరారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ జయంతి వేడుకలను పండువలా జరుపుకోవాలన్నారు. అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించేవారేరీ..!

అంబాజీపేట: మండలంలో ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఆ సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి తప్ప పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చి 25న మండల సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గడచిన మూడు నెలల కాలంలో సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఈనెల 8న స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశంలోనైనా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు తగు చర్యలు తీసుకుంటారో లేక ఎప్పటిలాగే గాలికొదిలేస్తారో వేచి చూడాల్సి ఉందని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

బీజేపీ సీనియర్ నేత వెంకట్రావు మృతి



మామిడికుదురు: కొమరాడ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత పోసంశెట్టి వెంకట్రావు (90) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన 1978లో ఆర్ఎస్ఎస్‌లో పని చేశారు. అనంతరం 1980 నుంచి బీజేపీలో చేరి పార్టీలో పలు పదవులు నిర్వహించారు. ఈ పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేశారు. ఆయన పార్థివదేహంపై పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం సోమవారం బీజేపీ జెండాను కప్పి వెంకట్రావు మృతికి సంతాపం తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, బీజేపీ నేతలు వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

10 మంది జూదరులపై కేసు

ఆలమూరు: పేకాట శిబిరాలపై పోలీసులు చేస్తున్న విస్తృత దాడులతో జూదరుల్లో అలజడి, ఆందోళన ప్రారంభమైంది. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ నేతృత్వంలో పోలీసుల బృందం అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవల మండలంలో చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేయగా ఆదివారం రాత్రి మరోసారి జొన్నాడ, సంధిపూడి గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,900 స్వాధీనం చేసుకున్నారు. అందులో జొన్నాడలో ముగ్గురి నుంచి రూ.3600, సంధిపూడిలో ఏడుగురు నుంచి రూ.10,300 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ఏఎస్సై కె.సూర్యచంద్రరావు కేసు నమోదు చేయగా సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ ఆదాయానికి గండి

కొత్తపేట: గ్రామ పంచాయతీకి చెందిన కొబ్బరిచెట్ల ద్వారా పలువురు పాటదారులు పంచాయతీకి మిగిలిన సొమ్ము చెల్లించకుండా పాట ముగిసినా దింపు తీయించి పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు. పలివెల గ్రామ పంచాయతీ పరిధిలోని 9 ప్రాంతాల్లో పంచాయతీకి సంబంధించి 989 కొబ్బరిచెట్లు ఉన్నాయి. వాటి ఫలసాయం పొందడానికి 2025 జూలై ఒకటితో కాలపరిమితి ముగిసింది. క్రితం పాటదారులు మూడు దఫాలుగా పాట సొమ్ము చెల్లించాలి. అయితే రెండు దఫాలు చెల్లించగా మూడో వాయిదా కింద రూ.2.40 లక్షలు చెల్లించవలసి ఉంది. మళ్లీ పాటలు నిర్వహించే వరకూ పంచాయతీయే దింపులు తీయించాలి. కానీ యథావిధిగా పాత ముగిసిన పాటదారులే దింపు తీయించేస్తున్నారు. అధికార పార్టీ అండ చూసుకుని వారు రెచ్చిపోతున్నారు. వారిని మిగతా వారు తామేం తక్కువ అంటూ దింపు తీయిస్తుండగా కార్యదర్శి, సిబ్బంది అడ్డుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పి.సత్తిబాబును వివరణ కోరగా నాలుగు బిట్లకు సంబంధించి ముగ్గురు పాటదారులు రూ.2.40 లక్షల బకాయి ఉన్న మాట వాస్తవమేనన్నారు. పాట కాలం పూర్తయినా కొబ్బరిదింపు తీస్తుండటంతో వెళ్లి నిలువరించామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రాంబాబు

కొత్తపేట: మండలంలోని గంటి సమీపాన ఉన్న నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ ఇండస్ట్రీ ప్రాంగణంలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో ప్లాంట్ హెడ్ పార్వతీకుమార్ పర్యవేక్షణలో ప్లాంట్ సిబ్బంది అగ్నిమాపక యంత్రాలను ప్రదర్శించి, ప్రయోగించారు. అగ్నిప్రమాదాలకు సంబంధించి ప్రయోగాత్మకంగా నివారించే విధానాన్ని ప్రదర్శించారు. మాక్ డ్రిల్ వలన ఎటువంటి ప్రమాదాలనైనా అరికట్టడమే కాక హానీ జరగదని అన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

కళా కృషితో కోనసీమకు వెలుగు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- ఘనంగా కళా వెంకట్రావు జయంతి
- పేదలకు అన్నదానం



రావులపాలెంలో కళా వెంకట్రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, కళా వెంకట్రావు కుటుంబ సభ్యులు

రావులపాలెం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర మాజీ రెవెన్యూ శాఖ మంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కళా వెంకట్రావు కృషితోనే కోనసీమ ప్రాంతానికి వెలుగు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కళా వెంకట్రావు 125వ జయంతి వేడుకలను వారి కుటుంబ సభ్యులు రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కళా వెంకట్రావు కాంస్య విగ్రహానికి జగ్గిరెడ్డి, కళా కుటుంబ సభ్యులు క్షీరాభిషేకం చేసి గజమాల, పూలమాలలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ కళా వెంకట్రావు కోనసీమ, రావులపాలెం ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, నేడు కోనసీమ ముఖద్వారంగా ఖ్యాతిగాంచిన రావులపాలెం మీదుగా జాతీయ రహదారి వెళ్లడానికి అప్పటి ఉమ్మడి మద్రాస్ ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపారన్నారు. ఫలితంగా రావులపాలెం మీదుగా హైవే వెళ్లిందన్నారు. ఆయన ముందుచూపు వల్లే కోనసీమ ప్రాంతం ఇంత అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు. గౌతమి, వశిష్ట గోదావరి నదులపై వారధులు కళా కృషి ఫలితమేనన్నారు. తద్వారా కోనసీమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నాడు రావులపాలెం సెంటర్లో జాతీయ రహదారిపై కళా వెంకట్రావు విగ్రహం ఏర్పాటు చేయడానికి తన తండ్రి మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి ఢిల్లీ వెళ్లి అనుమతులు సాధించి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. కళా వెంకట్రావు జయంతి వేడుకల్లో వారి కుటుంబ సభ్యులు మనవళ్లు, మునిమనవళ్లు కూడా పాల్గొనడం చాలా అభినందనీయమని అన్నారు. కళా మునిమనవడు కళా వెంకట్రావును దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే కళా కుటుంబ సభ్యులు జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, సీనియర్ న్యాయవాది పెద్దింటి వేణుగోపాల్, వానపల్లి మాజీ సర్పంచ్ కామిశెట్టి అమ్మన్న, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, ఐటీ విభాగం అధ్యక్షుడు కొవ్వూరి సుధాకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సఖినేటి వాకులరాజు, వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలివెలలో..

కొత్తపేట: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కళా వెంకట్రావు జయంతి కార్యక్రమాన్ని మండలంలోని పలివెల గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కళా వెంకట్రావు విగ్రహానికి వెంకటేశ్వర్లు, సంస్థ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే ఓఎన్జీసీ లక్ష్యం



సంధిపూడిలో జూట్ సంచులను పంపిణీ చేస్తున్న ఓఎన్జీసీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ లక్ష్యంగా ఓఎన్జీసీ సహకారం అందిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు కె.శ్రీకృష్ణ, బి.శివకుమార్ అన్నారు. మండలంలోని సంధిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తోట భవాని అధ్యక్షతన స్వచ్ఛ భారత్–స్వచ్ఛత సేవ అనే కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన జరిగింది. పర్యావరణ పరిరక్షణకు, పారిశుద్ధ్య కల్పనకు ఓఎన్జీసీ తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడిచెత్త, పొడిచెత్తను వేరే చేసేందుకు తమ వంతు సాయం అందిస్తామని తెలియజేశారు. పర్యావరణ హితం కోసం ఎంపీటీసీ తోలేటి సంతోషి, కూటమి నేతల చేతుల మీదుగా గ్రామస్తులకు చేతి జూట్ సంచులను ఓఎన్జీసీ ప్రతినిధులు పంపిణీ చేశారు. అలాగే రావులపాలేనికి చెందిన చిరంజీవి కళాజాత బృందం ప్రదర్శించిన స్వచ్ఛ భారత్ బుర్రకథ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. సూరపురెడ్డి పట్టాభి రామయ్య, సిద్ధిరెడ్డి వెంకటేష్, గ్రామ కార్యదర్శి ఎస్.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగ పోరాటం స్ఫూర్తిదాయకం



అంబాజీపేటలో కేకు కట్ చేస్తున్న నాయకులు

అంబాజీపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. అంబాజీపేటలో మందకృష్ణ మాదిగ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వేడుకలను నిర్వహించారు. మండల దండోరా యువత, నాయకుల ఆధ్వర్యంలో కేకు కట్ చేసి, బాణసంచాను పేల్చారు.

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని కూడా ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాంబిక అమ్మవారు



← చింతలూరులో శాకంబరిగా దర్శనమిచ్చిన నూకాంబిక అమ్మవారు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన గ్రామదేవత నూకాంబిక అమ్మవారు సోమవారం శాకంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారిని ఏటా శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా విశ్వావసు నామ సంవత్సర ఆషాఢ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గుప్త నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మహిళ భక్తబృంద సభ్యులు 108 కిలోల వివిధ రకాల కూరగాయలు, పండ్లు ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ మండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. శాకంబరి అవతారంతో ఉన్న గ్రామ దేవత నూకాంబిక అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అగ్రికల్చర్ డ్రోన్ల పంపిణీ



పి.గన్నవరంలో రైతు గ్రూపులకు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: వ్యవసాయ రంగంలో రైతులు యాంత్రీకరణ వైపు దృష్టి సారించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేటకు చెందిన కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్, ముంగండకు చెందిన శ్రీవాసవీ కృషాస్ గ్రూపులకు రూ.9,81,000ల విలువైన అగ్రికల్చర్ డ్రోన్లను 80 శాతం రాయితీతో సోమవారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునీక పద్ధతులను అవలంభించి ఎక్కువ లాభాలు ఆర్జించాలని అన్నారు. అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరావు, మండల వ్యవసాయ అధికారులు సీహెచ్‌డీ విజయకుమార్, కె.ధర్మప్రసాద్, నాయకులు బొంతు పెదబాబు, గణపతి వీరాఘవులు, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరావు, మైపాల తాతాజీ, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు నిలయంగా బస్ స్టేషన్



అస్తవ్యస్తంగా తయారైన అంబాజీపేట బస్‌స్టేషన్

అంబాజీపేట: గతంలో ఎంతో వైభవాన్ని చూరగొని, స్థానికులతో పాటు దూరప్రాంత ప్రయాణికులకు ఎన్నో సేవలందిస్తున్న అంబాజీపేట బస్‌స్టేషన్ నేడు అనాథగా తయారై మందుబాబులకు నిలయంగా మారింది. అంతేకాకుండా బస్ స్టేషన్‌లో సౌకర్యాలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొద్దిపాటి వర్షం వస్తే బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతమంతా వర్షపు నీటితో తడిసి ముద్దవుతుందన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంటుందని వాపోయారు. బస్ స్టేషన్‌లో మందుబాబుల ఆగడాలు రోజు రోజుకీ శ్రుతి మించుతున్నాయని, బస్ కోసం ఎదురు చూసే ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ఆవేదన చెందారు. చీకటి పడితే మందుబాబులతో పాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండటంతో ప్రయాణికులు అక్కడ వేచి ఉండటానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఆర్టీసీ అధికారులు బస్‌స్టేషన్‌లో ఒక కంట్రోలర్‌ను నియమించి, అనంతరం తొలగించారు. ప్రస్తుతం ఇక్కడ ఎవరూ లేకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో సమాచారం చెప్పే నాథుడే కరువయ్యాడు. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు టాయిలెట్స్‌కు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడం, నీరు అంతంత మాత్రంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్ స్టేషన్ ప్రాంగణమంతా తుప్పలతో నిండిపోయి విషసర్పాలకు నిలయంగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌స్టేషన్‌ను అభివృద్ధి చేసి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు

రావులపాలెం: గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల పదో తేదీన రావులపాలెం షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి సోమవారం తెలిపారు. పదో తేదీ ఉదయం 5.15 నిమిషాలకు కాకడ హారతి, 6 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, తొమ్మిది గంటలకు సాయి సామూహిక సత్యవ్రతాలు, సాయంత్రం నాలుగు గంటలకు గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జ్యోతిర్మయి హైదరాబాద్ వారితో బాబా ప్రవచన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు పల్లకి సేవ మేళతాళాలతో కోలాట బృందాలతో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.13 వేల సాయం



సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ. 13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ వివరాలను సంస్థ ప్రతినిధులు సోమవారం రావులపాలెంలో తెలిపారు. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన అమలాపురపు వీరభద్రం (42) లివర్ పాడైంది. లివర్ మార్పిడి చేయాలని, దానికి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. వీరభద్రానికి భార్య లివర్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల వరకు సాయం వస్తుందని, ఇంకా రూ.20 లక్షల వరకూ అవసరం ఉందన్నారు. తాపీమేస్త్రిగా పని చేసుకునే అతని కుటుంబానికి అంత ఆర్థికస్తోమత లేకపోవడంతో దాతల సాయం కోసం అర్థిస్తున్నారు. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో రావులపాలెంలో వీరభద్రం కొడుకు నితీష్‌కుమార్‌కి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేల చెక్కు అందజేశారు.